సేవాలాల్ జయంతిని ప్రభుత్వం నిర్వహించాలి



షాద్‌నగర్ రూరల్, జనవరి 28: సంత్ సేవాలాల్ జయంతిని ప్రభుత్వం నిర్వహించి ఆ రోజు సెలవు ప్రకటించాలని షాద్‌నగర్ గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం షాద్‌నగర్‌లోని టీచర్స్ కాలనీలో గల ఆలయంలో సమావేశమై ఫిబ్రవరి 15న జరిగే జయంతిని ఘనంగా నిర్వహించేందుకు కృషిచేయాలని తీర్మానించారు. రఘు నాయక్, శంకర్, గోపాల్, లక్ష్మణ్, రూప్లా, బాలూనాయక్ పాల్గొన్నారు.

- మహాలక్ష్మి పథకానికే ఎక్కువ మంది అర్జీలు
- దరఖాస్తుల కంప్యూటరీకరణ పూర్తి
- లబ్ధిదారుల ఎంపికకు మార్గదర్శకాలు విడుదల చేయని ప్రభుత్వం
- పథకం అమలు కోసం మంత్రులతో సబ్ కమిటీ
- ఫిబ్రవరిలో ఇంటింటి సర్వే

కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం గత డిసెంబరు 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు గ్రామాలు, పట్టణాల్లో ఆరు గ్యారంటీ పథకాల కోసం ప్రజల నుంచి 'అభయహస్తం' దరఖాస్తులను స్వీకరించింది. జిల్లాలోని 558 పంచాయతీలు, మూడు కార్పొరేషన్లు, 13 మునిసిపాలిటీల్లో వెల్లువలా దరఖాస్తులొచ్చాయి. మొత్తం 20,99,208 అర్జీలొచ్చినట్టు అధికారులు నిర్ధారించారు. వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఆరు గ్యారంటీల్లో పేర్కొన్న పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం యంత్రాంగం వచ్చే నెల నుంచి ఇంటింటి సర్వే చేపట్టనుంది. కాగా ప్రభుత్వం ప్రకటించిన గ్యారంటీలను త్వరగా అమలుచేయాలని పేదలు కోరుతున్నారు. ఇందుకు సర్కారు మార్గదర్శకాలను జారీచేయాల్సి ఉంది.

'అభయహస్తం' దరఖాస్తుల వివరాలు

గ్రామ పంచాయతీలు : 558	చేయూత : 1,01,016
మునిసిపాలిటీలు : 13	రూ.500కే గ్యాస్ : 4,32,676
కార్పొరేషన్లు : 3	ఇందిరమ్మ ఇళ్లు : 3,91,023
కుటుంబాల సంఖ్య : 2,46,626	
మహాలక్ష్మి అర్జీలు : 4,56,839	
రైతు భరోసా : 3,17,788	
గృహజ్యోతి : 3,99,866	లక్షల్లో నమోదైన దరఖాస్తులు





తేలిన లెక్క!

అభయహస్తం దరఖాస్తులు 20,99,208

(ఆంధ్రజ్యోతి-రంగారెడ్డి అర్బన్, జనవరి 28): ప్రజాపాలనలో వేటికెన్ని అర్జీలొచ్చాయో లెక్కతేలింది. జిల్లాలో 'అభయహస్తం' ఆన్‌లైన్ ప్రక్రియ ఇటీవలే ముగియగా మహాలక్ష్మి పథకానికి అత్యధికంగా అర్జీలొచ్చాయని నిర్ధారణైంది. డిసెంబరు 28వ తేదీ నుంచి ఈ నెల 6వ తేదీ వరకు గ్రామాల్లో, పట్టణాల్లో రోజువారీగా దరఖాస్తులను స్వీకరించారు. వెల్లువలా అర్జీలొచ్చిన విషయం తెలిసిందే. ఆ దరఖాస్తులను ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తవగా ఇక క్షేత్రస్థాయి పరిశీలన చేయనున్నారు. ప్రభుత్వం వెలువరించే మార్గదర్శకాలకు అనుగుణంగా స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన లబ్ధిదారులకు అభయహస్తం ఫలాలను వర్తింపజేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాసమస్యలను విస్మరించిందని ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రజలకు వివరించి గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీల అమలుకు ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించి దరఖాస్తులను స్వీకరించింది. జిల్లాలోని 558 గ్రామ పంచాయతీలు, మూడు కార్పొరేషన్లు, 13 మునిసిపాలిటీల్లో దరఖాస్తులు స్వీకరించారు. మహిళలకు, పురుషులకు వేర్వేరు క్యూలైన్లను ఏర్పాటు చేసి దరఖాస్తులను తీసుకున్నారు. ప్రతీ వంద దరఖాస్తులకు ఒక కౌంటర్ చొప్పున ఏర్పాటు చేశారు. ప్రజాపాలన మానిటరింగ్‌కు కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. అభయహస్తం కింద మహాలక్ష్మి, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాలకు దరఖాస్తులను కౌంటర్లలో రసీదు ఇచ్చారు. ప్రతీ దరఖాస్తుకు నంబర్‌ను ఇచ్చారు. అభయహస్తం దరఖాస్తుల డేటా ఎంట్రీ జనవరి 17వ తేదీ వరకు పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్ణయించి ఇందుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించింది. దరఖాస్తులు భారీగా రావడంతో డేటా కంప్యూటర్‌లో నిక్షిప్తానికి కొంత ఆలస్యం అయింది. ఎట్టకేలకు దరఖాస్తుల కంప్యూటరీకరణ పూర్తి చేశారు.

ఇంకా వెలువడని మార్గదర్శకాలు

దరఖాస్తుల కంప్యూటరీకరణ ప్రక్రియ ముగియడంతో అధికారులు ఇంటింటి సర్వేతో దరఖాస్తుల పరిశీలనకు కసరత్తు చేస్తున్నారు. ఏ పథకానికి ఎన్ని దరఖాస్తులొచ్చాయనే విషయం లెక్క తేలింది. అభయహస్తం ఐదు పథకాలతో పాటు రేషన్ కార్డులు, ఇతర వ్యక్తిగత సమస్యలపై తెల్లకాగితాలపైనా వినతులొచ్చాయి. అయితే అర్హుల ఎంపికకు సంబంధించి ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వెలువడలేదు. మార్గదర్శకాలు వచ్చాక సర్వే చేసి అర్హుల పేర్లను పోర్టల్‌లో నమోదు చేస్తారు.

ఫిబ్రవరిలో క్షేత్రస్థాయి పరిశీలన

అర్హులందరికీ సంక్షేమ ఫలాలందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తవగా ఫిబ్రవరిలో కీలకమైన క్షేత్రస్థాయి పరిశీలనకు యంత్రాంగాన్ని ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. వచ్చిన దరఖాస్తుల మేరకు ఇంటింటి సర్వే చేసి అర్హులను ఎంపిక చేస్తారు. ఆరు గ్యారంటీల అమలుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చైర్మన్‌గా క్యాబినెట్ సబ్ కమిటీని నియమించారు. ఇందులో సభ్యులుగా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు ఉన్నారు. అర్హులైన వారికే అభయహస్తం పథకాలను వర్తింపజేసేలా సబ్ కమిటీ పనిచేస్తుంది. ఈ సబ్ కమిటీ ఇచ్చే గైడ్‌లైన్స్ ప్రకారం క్షేత్రస్థాయిలో అధికారులు చర్యలు తీసుకుంటారు.

అభయహస్తం అమలు కోసం ఎదురుచూస్తున్నాం



కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీల్లో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడం సంతోషం. అదే విధంగా ప్రజాపాలనలో తీసుకున్న దరఖాస్తులను కూడా త్వరగా పరిశీలించి నాలాంటి నిరుపేదలకు ప్రభుత్వం ప్రకటించిన పథకాలు వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలి.

\- వహీదాబి, తుమ్మలపల్లి, చౌదరిగూడ మండలం

త్వరగా సర్వే చేసి అర్హులను ఎంపిక చేయాలి



నేను నిరుపేదను. నాకు రేషన్ కార్డు లేదు. ఎన్నోసార్లు మీ సేవల్లో రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నా. ప్రజాపాలనలో రేషన్ కార్డుతో పాటు రూ.500కే గ్యాస్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ కోసం దరఖాస్తు చేసుకున్నా. త్వరగా సర్వే చేసి అర్హులైన వారిని ఎంపిక చేసి పథకాలను వర్తింపజేయాలి.

\- నస్రీమున్నీసా, తుమ్మలపల్లి

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త!

ప్రజల అవసరాలను ఆసరగా చేసుకొని సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. గతంలో లాటరీ, లక్కీ డ్రా, గిఫ్ట్‌లు, క్రెడిట్ కార్డుల పేరుతో ప్రజలను దోచుకునేవారు. ఇప్పుడు తాజాగా కొత్త పంథాను ఎంచుకున్నారు. వివిధ మార్గాల్లో ఆన్‌లైన్ మోసాలకు తెగబడుతున్నారు. అభయహస్తం పథకంలోని ప్రజాపాలన దరఖాస్తుదారులను లక్ష్యంగా చేసుకొని మోసాలకు పాల్పడుతున్నారు. దరఖాస్తుదారుల బ్యాంక్ ఖాతాల్లోని డబ్బులు కాజేసేందుకు సైబర్ మోసగాళ్లు కొత్త ప్లాన్ వేశారు. దరఖాస్తుదారుల్లో 90శాతం మహిళలే ఉన్నారు. దరఖాస్తుల్లో పేర్కొన్న వారి ఫోన్ నంబర్లకు కాల్ చేసి నమ్మించి ఓటీపీ అడుగుతున్నారు. 'మీ అభయహస్తం దరఖాస్తు ఆన్‌లైన్ చేయాలి.. మీకు ఫలానా పథకం వర్తింపజేయాలంటే ఓటీపీ నంబర్ చెప్పాలి.' అంటూ మోసగిస్తున్నారు. ఓటీపీ చెప్పగానే బ్యాంక్ బ్యాలెన్స్‌ను ఖాళీ చేస్తున్నారు. ఇలాంటి సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఎవరికీ ఓటీపీలు, బ్యాంక్ అకౌంట్ల నంబర్లు, ఇతర వివరాలేవీ చెప్పొద్దని పోలీసులు సూచిస్తున్నారు.

గుర్రంపీర్ జాతరకు పోటెత్తిన జనం



గుర్రంపీర్‌కు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

చౌదరిగూడ, జనవరి 28: గుర్రంపల్లి గుర్రంపీర్ ఉర్సు ఉత్సవాలు వైభవంగా కొనసాగున్నాయి. జాతర మూడో రోజు ఆదివారం కందూరు కార్యక్రమాల్లో భాగంగా భక్తులు గుర్రంపీర్‌కు మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ గ్రామాల నుంచి వేలాది మంది గుర్రంపీర్ జాతరకు తరలివచ్చారు. జాతరలో ఏర్పాటు చేసిన మిఠాయి, జిలేబీ, గాజులు తదితర దుకాణాలు కిటకిటలాడాయి. కాగా గుర్రంపల్లిలో కొనసాగుతున్న గుర్రంపీర్ ఉర్సులో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పాల్గొన్నారు. అశ్వానికి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ గణేష్, జెడ్పీటీసీ స్వరూప, కొందుర్గు వైస్‌ఎంపీపీ రాజేష్ పటేల్, సర్పంచ్‌లు బాబూరావు, కిష్టమ్మ, నాయకులు హఫీజ్, జబ్బార్, అక్రం, మాణెయ్య, మల్లేష్ పాల్గొన్నారు.



ప్రార్థనలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య

తప్పిన పెను ముప్పు

- అదుపుతప్పి మెకానిక్ షెడ్డులోకి దూసుకెళ్లిన కారు
- త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డ మెకానిక్‌లు



కందుకూరులో మెకానిక్ షెడ్డులోకి దూసుకెళ్లి ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు

కందుకూరు, జనవరి 28: కందుకూరులో ఆదివారం త్రుటిలో పెను ముప్పు తప్పింది. బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని గిరి ట్రాక్టర్ మెకానిక్ షెడ్డులో ఇద్దరు మెకానిక్‌లు ట్రాక్టర్ రిపేర్ పనుల్లో ఉన్నారు. మధ్యాహ్నం 12:30సమయంలో నగరం నుంచి కడ్తాల్‌లో ఉన్న వెంచర్‌లో ప్లాట్లు చూసేందుకని కొందరు కారు(టీఎస్05 ఇ1658)లో వెళ్తున్నారు. కారు మెకానిక్ షెడ్డు వద్ద అతివేగంగా వెళ్తున్న సమయంలో సడెన్ బ్రేక్ వేశారు. దీంతో కారు అదుపుతప్పి అదే వేగంతో మెకానిక్ షెడ్డులోకి దూసుకెళ్లింది. అక్కడ నిలిపి ఉన్న ట్రాక్టర్‌ను, రెండు బైక్‌లను ఢీకొంది. ఈ ప్రమాదానికి రెండు నిమిషాల ముందే మెకానిక్‌లు భాను, మరో వ్యక్తి అప్పటి వరకు ట్రాక్టర్ రిపేర్ చేసి షెడ్డులోనికి వెళ్లారు. అంతలోనే కారు వచ్చి ఢీకొంది. ఒకవేళ వారు అక్కడే రిపేర్ పనిలో ఉండి ఉంటే ఇద్దరి ప్రాణాలకు ముప్పు కలిగేదని స్థానికులు అన్నారు. ఇదిలా కారులో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కొండమల్ల రవికి శుభాకాంక్షలు తెలుపుతున్న టీఆర్ఎన్‌జీవో నేతలు


'ట్రెంగ' రాష్ట్ర సంఘం ఎన్నిక

రంగారెడ్డి అర్బన్, జనవరి 28 : తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్(ట్రెంగ) రాష్ట్ర సంఘాన్ని ఆదివారం నగరంలోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర సంఘంలో రంగారెడ్డి జిల్లా నుంచి ముగ్గురికి చోటు దక్కింది. రాష్ట్ర అధ్యక్షుడిగా కొండమల్ల రవి, గౌరవాధ్యక్షుడిగా శేఖర్, ఉపాధ్యక్షుడిగా కె.శ్రీనివాసరావులు ఎన్నికయ్యారు. అలాగే జిల్లాకు చెందిన పట్టాల విజయ్ బాబు ప్రధాన కార్యదర్శిగా, కోశాధికారిగా మహ్మద్ షఫీ, ప్రచార కార్యదర్శిగా మహ్మద్ గౌస్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ.. తెలంగాణ రెవెన్యూ నాన్ గెజిటెడ్ ఉద్యోగులైన సీనియర్ అసిస్టెంట్లు, గిర్దావర్లు, జూనియర్/రికార్డ్ అసిస్టెంట్లు, టైపిస్టులు, స్టెనో కం టైపిస్ట్‌లు, ప్రభుత్వ డ్రైవర్లు, చైన్‌మెన్, ఆఫీస్ సబార్డినేట్స్, వాచ్‌మెన్ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషిచేస్తానని చెప్పారు.

బీఆర్ఎస్‌లో కలకలం!

- సీఎం రేవంత్‌రెడ్డితో బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ భేటీ
- త్వరలో కాంగ్రెస్‌లో చేరిక? అదే బాటలో మరి కొందరు!?
- కాంగ్రెస్‌లో చేరిక అవాస్తవం : ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

రంగారెడ్డి అర్బన్, జనవరి 28 : ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి షాక్ ఇచ్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధం అయ్యారా? అంటే అవుననే సంకేతాలొస్తున్నాయి. పార్లమెంట్ ఎన్నికలకు గడువు సమీపిస్తున్న తరుణంలో పాలక కాంగ్రెస్ పార్టీలో చేరికలపై దృష్టి సారించింది. బీఆర్ఎస్‌లోని ముఖ్య నేతలను, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులను కలుపుకుపోయే ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఈ నేపథ్యంలోనే ఈ నెల 27న మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి సీఎంను కలవడం కలకలం రేపింది. తాజాగా ఆదివారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సీఎం రేవంత్‌రెడ్డిని కలవడం చర్చనీయాంశమైంది. గంట సేపు సీఎంతో ఎమ్మెల్యే చర్చలు జరపడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఈ భేటీ వెనక రాజకీయ కోణం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా తెలంగాణ ఏర్పాటుకు ముందు ప్రకాశ్‌గౌడ్ టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలవడం, రేవంత్‌రెడ్డితో దగ్గరి పరిచయాలు ఉండడం ఈ సందర్భంగా గమనార్హం. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఒక్కొక్కరుగా సీఎంను కలుస్తుండడం వెనక కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్షకు తెరలేపిందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. త్వరలో ప్రకాశ్‌గౌడ్ కాంగ్రెస్‌లో చేరతారనే ప్రచారం ఊపందుకుంది. సీనియర్ ఎమ్మెల్యే అయిన ఆయన బీసీ కోటాలో మంత్రి పదవి సైతం ఆశిస్తున్నట్లు సమాచారం. ప్రకాశ్‌గౌడ్ బాటలోనే మరి కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే తాను కాంగ్రెస్‌లో చేరినట్లు సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని ప్రకాశ్‌గౌడ్ ఖండించారు. తన నియోజకవర్గంలోని రాజేంద్రనగర్, శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడ, బహద్దూర్‌గూడ, ఘన్సిమియాగూడ గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలకు ప్రభుత్వం పరిష్కారం చూపాలని, అలాగే నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరేందుకే తాను సీఎంను కలిశానని ఈ సందర్భంగా ప్రకాశ్‌గౌడ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డితో బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



పూల తివాచీ పరిచినట్టు!

యాచారంలో రోడ్డు పక్కన ఓ చెట్టు ఎర్రని పూలు విరబూసి వచ్చిపోయేవారిని ఆకట్టుకుంటోంది. ఆకులు, మండలు కన్పించకుండా చెట్టంతా పూలే దర్శనమిస్తూ కనువిందు చేస్తోంది. ఉదయం, సాయంత్రం ఈ చెట్టు అందం మరింత పెరుగుతూ ఆహ్లాదకరంగా అనిపిస్తోంది. యువకులు ఈ పూల చెట్టును తమ సెల్‌ఫోన్లతో ఫొటోలు తీసుకుంటూ సంబరపడుతున్నారు. ఇప్పుడా చెట్టు ఓ సెల్ఫీ పాయింట్‌గా మారింది!

\- యాచారం, జనవరి 28



నందిగామ వద్ద నిలిచిన నర్సప్పగూడ రోడ్డు పనులు

మధ్యలో నిలిచి.. బాధలు మిగిల్చి!

- రోడ్లకు కంకర వేసి వదిలేశారు
- అవస్థల్లో ప్రజలు, వాహనదారులు

నందిగామ, జనవరి 28: పల్లెలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ప్రభుత్వం ఆర్భాటంగా తలపెట్టిన గ్రామీణ రోడ్ల పనులు సగంలోనే నిలిచిపోయాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పలు రోడ్ల నిర్మాణాన్ని చేపట్టి గ్రామీణ రోడ్ల పనులు మొదలుపెట్టారు. నందిగామ నుంచి వీర్లపల్లి, మామిడిపల్లి, నర్సప్పగూడ రోడ్లు, అలాగే నందిగామ నుంచి బైపాస్ రోడ్డు వరకు ఎన్నికల ముందు హడావిడిగా పనులు మొదలుపెట్టారు. ఈలోగా ఎన్నికల నోటిఫికేషన్, కోడ్ రావడంతో పనులు నిలిచాయి. కాంట్రాక్టర్లు రోడ్లపై కంకరవేసి వదిలేయడంతో వాహనదారుల సమస్యలు రెట్టింపయ్యాయి. ప్రయాణికులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. కంకరపై నిత్యం నరకప్రాయంగా ప్రయాణిస్తున్నారు. కంకర, మట్టితో వాహనాల రాకపోకలతో దుమ్మురేచి రోడ్ల పక్కనున్న పంటలకు నష్టం వాటిల్లుతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వం పోయి కొత్త ప్రభుత్వం వచ్చింది. నెలల కింద చేపట్టిన రోడ్లను నూతన పాలకులు పూర్తిచేయమాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు శ్రద్ధ తీసుకొని సగంలో నిలిచిన రోడ్లను వెంటనే చేపట్టాల్సి ఉంది.

కమీషన్ల కోసమే పనులు ఆగిపోయాయి



పాత ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు కమీషన్ల కోసం కక్కుర్తిపడ్డందునే కాంట్రాక్టర్లు తలపట్టుకుంటున్నారు. బిల్లులు రాకపోవడంతోనే రోడ్ల పనులను మధ్యలో ఆపేశారు. అప్పటి ప్రభుత్వం బిల్లులను వెంటవెంటనే చెల్లించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతికి తావులేకుండా కృషి చేసి రోడ్లన్నీ పూర్తి చేయించుకుంటాం.

\- కాట్న సురేందర్, కాంగ్రెస్ నాయకుడు, నర్సప్పగూడ

రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలి



నందిగామ నుంచి వీర్లపల్లి వరకు రోడ్డును త్వరగా పూర్తి చేయాలి. సగం పనులే చేయడంతో మేం ఇబ్బందులు పడుతున్నాం. ఈ రోడ్డు పూర్తయితే మా గ్రామం నుంచి మండల కేంద్రానికి దూరం తగ్గుతుంది. వీర్లపల్లి రోడ్డు మధ్యలో ఉన్న వాగుపై బ్రిడ్జి కట్టాలి. వంతెన లేక వానాకాలంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. వాగులో నుంచే ప్రమాదకరంగా ప్రయాణించాల్సి వస్తోంది.

\- కృష్ణాగౌడ్, వీర్లపల్లి



పనులు నిలిచిన వీర్లపల్లి-నందిగామ రోడ్డు

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

రెవెన్యూ సదస్సులతో 'ధరణి' సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న ఎంపీపీ విజయలక్ష్మి

చేవెళ్ల, జనవరి 28 : గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులతో ధరణి సమస్యలు పరిష్కారమవుతాయని చేవెళ్ల ఎంపీపీ మాల్గారి విజయలక్ష్మి తెలిపారు. ఆదివారం చేవెళ్లలో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ తెలంగాణలో ధరణి పోర్టల్ వల్ల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం చిత్తశుద్ధితో ఆలోచనచేసి పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ కమిటీల పేరుతో కాలయాపన చేయెద్దని, ప్రజల వద్దకే పాలనపై దృష్టిసారిస్తే ధరణి సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. అధికారులు గ్రామస్థాయిలో అభిప్రాయాలు తీసుకొని సమస్యలు పరిష్కారం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా స్థాయిలో భూసమస్యల పరిష్కారం అనేది సాధ్యమయ్యేది కాదన్నారు. కమిటీలు అంటూ కాలయాపన చేసి సమస్యలను మరింతగా పెంచడం సరికాదన్నారు. ఇప్పటికే ధరణి సమస్యల కారణంగా ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. భూమికి సంబంధం లేని వ్యక్తుల పేర్లు రికార్డుల్లో రావటం, ఉన్న భూమికంటే ఎక్కువ భూమి నమోదు కావటం, కొందరికి తక్కువ నమోదు కావడం వంటి సమస్యలున్నాయని అన్నారు. అదేవిధంగా పేర్ల నమోదులో కూడా చాలా తప్పులు ఉన్నాయని, వాటిని సరిచేసే ఆప్షన్ లేకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ధరణి సమస్యలు పరిష్కరించి అందరికీ న్యాయం చేయాలని ఎంపీపీ కోరారు.

పంచభూతీశ్వర ఆలయంలో చండీహోమం


పంచభూతీశ్వరాలయంలో చండిహోమం నిర్వహిస్తున్న అర్చకులు

కొత్తూర్, జనవరి 28 : మండల పరిధిలోని తీగాపూర్ గ్రామ శివారులో గల పంచభూతీశ్వర ఆలయంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. పంచభూతీశ్వర ఆలయ వ్యవస్థాపకుడు, రాష్ట్రపతి పురస్కార్ గ్రహీత డాక్టర్ పీజీ కేశవులు ఆధ్వర్యంలో ఆదివారం ఆలయ ప్రాంగణంలో వేద పండితులు చండీహోమంతో పాటు, చతుష్టి లలితాదేవి అమ్మవారికి, ప్రధాన దేవత మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేశవులు మాట్లాడుతూ లోకకల్యాణం కోసం పంచభూతీశ్వర ఆలయాన్ని స్థాపించి, ప్రధాన దేవతగా చతుష్టి లలితాదేవి అమ్మవారిని ప్రతిష్ఠించామని చెప్పారు. ఈనెల 22న శ్రీ సీతారామచంద్రుల విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించామని పేర్కొన్నారు. హైదరాబాద్ చుట్టు ప్రక్కన ఇలాంటి ఆలయం మరెక్కడా లేదన్నారు. లోక కల్యాణం కోసం ఎన్నో యాగాలు జరిపినట్లు తెలిపారు. ఆనంతరం అన్నదానం నిర్వహించారు. విజయ్‌భాస్కర్, వర్ధ ముని, జీఎస్ చక్రవర్తి, బీవీ ప్రదీప్, భక్తులు పాల్గొన్నారు.

ఏకగ్రీవాలకు ప్రోత్సాహమేది



- పదవీ కాలం ముగుస్తున్నా అందని నజరానా
- జిల్లాలో ఆ పంచాయతీలు 75
- రూ.10 లక్షలు చెల్లిస్తామని గత సర్కారు హామీ

వికారాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : నాలుగు రోజుల్లో పదవీకాలం ముగియవస్తున్నా ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయతీలకు గత ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహక నజరానా నిధులు అందలేదు. ఏకగ్రీవమైతే ప్రోత్సాహక నిధులు వస్తాయని ఆశించిన పాలకవర్గాలకు చివరకు నిరాశే మిగిలింది. అయిదేళ్ల పదవీకాలం ముగియవచ్చినా ఆ నిధులు విడుదల చేయకపోవడంతో ఆయా పాలకవర్గాలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నాయి. ప్రోత్సాహక నిధులతో గ్రామాల్లో సమస్యలు పరిష్కరించుకోవచ్చని భావించిన వారికి నిధులు విడుదల చేయకుండానే బీఆర్ఎస్ అధికారం కోల్పోయిందని, అధికారంలో ఉన్నప్పుడు మొండి చెయ్యి చూపిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పంచాయతీ పాలకమండలిల పదవీ కాలం ఫిబ్రవరి 2న ముగుస్తుంది. ఇటీవల కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటికీ ఏకగ్రీవ పంచాయతీల పాలక వర్గాలకు ప్రోత్సాహక నజరానా అందేలా లేదు. జిల్లాలో మొత్తం 566 గ్రామ పంచాయతీలు ఉండగా, 2019 జనవరిలో వాటికి మూడు విడతల్లో జరిగిన ఎన్నికల్లో 75 పంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నికై అదే ఏడాది ఫిబ్రవరి 2న కొలువుదీరాయి. స్థానిక సంస్థల్లో ఏకగ్రీవాలను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయతీలకు రూ.10 లక్షలు ప్రోత్సాహకంగా ఇస్తామని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించింది. ఆ నిధులకుతోడు మరో రూ.5 లక్షలను నియోజకవర్గ అభివృద్ధి నిధుల్లో నుంచి కేటాయిస్తామని అప్పటి సీఎం కేసీఆర్ ప్రకటించారు.

ప్రత్యేక గుర్తింపు వస్తుందని..

ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహక నజరానాతో పాటు తమ గ్రామాలకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని భావించి పంచాయతీ పాలక వర్గాలు ఏకగ్రీవమయ్యేలా అన్ని వర్గాల ప్రజలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు విబేధాలను పక్కనపెట్టి కృషి చేశారు. ఆ నిధులతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టవచ్చని భావించి ఆ దిశగా అందరూ ఒకేతాటిపైకి వచ్చారు. ఎన్నికల సమయంలో బరిలో నిలిచిన వారిని పోటీ నుంచి తప్పించేందుకు ఎంతో కొంత ముట్టజెప్పి ఏకగ్రీవమయ్యేలా కృషి చేశారు. ఏకగ్రీవమయ్యేందుకు తమకు ఖర్చులు తడిసి మోపెడైనా గ్రామాభివృద్ధికి ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుందని భావించి ఆయా నాయకులు కృషి చేశారు. కానీ వారికి చివరకు నిరాశే మిగిలింది. జిల్లాలో ఏకగ్రీవమైన ఒక్కో పంచాయతీకి రూ.10 లక్షల ప్రోత్సాహకం అందించాల్సినవి రూ.7.50 కోట్లు, నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి ఇస్తామన్న మరో రూ.3.75 కోట్లు విడుదల చేయాల్సి ఉంది.

కొత్త ప్రభుత్వమైనా ఇవ్వాలి

ప్రభుత్వం ఇవ్వాలసిన నజరానా కోసం ఆయా పాలక వర్గాలు ఎదురు చూస్తున్నాయి. గతంలో పలుమార్లు మాజీ సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకు వెళ్లినా ఫలితం లేకపోయిందని పలువురు సర్పంచ్‌లు వాపోతున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందైనా నిధులు విడుదల చేస్తారని పాలకవర్గాలు ఆశించినా నిరాశే ఎదురైంది. కాంగ్రెస్ ప్రభుత్వమైనా తమ పంచాయతీలకు ప్రోత్సాహక నిధులు విడుదల చేసి ఆదుకోవాలని ఏకగ్రీవ పంచాయతీల సర్పంచులు, ప్రజలు కోరుతున్నారు.

అంతర్జాతీయ కరాటే పోటీల్లో ఆమనగల్లు విద్యార్థుల ప్రతిభ


చాంపియన్‌షిప్ సాధించిన విద్యార్థులు

ఆమనగల్లు, జనవరి 28 : అంతర్జాతీయ కరాటే పోటీల్లో మండలానికి చెందిన జపాన్ కరాటే అసోసియేషన్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో చాంపియన్‌షిప్ సాధించారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం వరల్డ్ నకాయామ్ చోటోఖాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండవ అంతర్జాతీయ ఓపెన్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ - 2024 పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మాస్టర్ జగదీశ్వర్ ఆధ్వర్యంలో కరాటే విద్యార్థులు అనీష్, శ్రీహాన్, లోకేష్, జగదీశ్, రిత్విన్, దేవానంద్, ప్రవీణ్, వంశీ, శిరీష పాల్గొని సత్తా చాటారు. జాతీయస్థాయిలో చాంపియన్‌షిప్‌తో పాటు ఐదు గోల్డ్, నాలుగు సిల్వర్ మెడల్స్ సాధించారు. నకాయామ్ చోటో ఖాన్ కరాటే నిర్వాహకుడు అమర్‌సింగ్ విజేతలకు మెడల్స్, ప్రశంస పత్రాలు అందజేశారు. మాస్టర్ జగదీశ్వర్‌ను అభినందించి షీల్డ్‌ను బహూకరించారు. అంతర్జాతీయ కరాటే పోటీల్లో సత్తాచాటిన ఆమనగల్లు విద్యార్థులను పలువురు అభినందించారు.

ప్రజలందరి సహకారంతోనే గ్రామాభివృద్ధి


అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి,ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

చౌదరిగూడ, జనవరి 28 : ప్రజలందరి సహకారంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం అవుతుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గుంజల్‌పహాడ్‌లో జడ్పీ నిధులతో నిర్మించిన అంగన్వాడీ కేంద్ర నూతన భవనాన్ని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డితో కలిసి ఎమ్మెల్యే శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం పేరిట గ్రామ పంచాయతీలను అశాస్త్రీయంగా ఏర్పాటు చేసిందని విమర్శించారు. ప్రజా సంక్షేమం కోసమే కాంగ్రెస్ పని చేస్తుందని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ ఖచ్చితంగా నేరవేర్చుతామన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చెయకుండా బాధ్యతయుతమైన పాలన అందిస్తామని చెప్పారు. గ్రామాభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. సర్పంచుల పదవీకాలం నాలుగు రోజుల్లో ముగుస్తుందని ఐదు సంవత్సరాలుగా సేవ చేసినందుకు వారిని అభినందించారు. సేవ చేసిన నాయకులను ప్రజలు ఎప్పుడు మరిచి పోరని చెప్పారు.

మహిళా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

మహిళా, శిశు సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి అన్నారు. మహిళలకు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని అందించాలని అన్నారు. భవనాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. జడ్పీకి ఎమ్మెల్యే నిధులు తోడైతే గ్రామాల అభివృద్ధి మరింత సాధ్యం అవుతుందన్నారు. స్థానిక సమస్యలపై దృష్టి సారించి పని చేస్తేనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. జడ్పీటీసీ స్వరూప, సర్పంచ్ జ్యోతి, బాల్‌రాజ్, గోపాల్, ఎంపీటీసీ సత్యనారాయణరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ దామోదర్‌రెడ్డి, సీడీపీవో నాగమణి, మండలఅధ్యక్షుడు రాజు, చంద్రశేఖర్, వెంకట్‌నర్సింహారెడ్డి, వేణుగోపాల్, అన్వర్, రాజు, పాల్గొన్నారు.

కొడంగల్ సమగ్రాభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి

- ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు ఉత్తర్వులు
- కొడంగల్, కోస్గి ఆసుపత్రుల అప్‌గ్రేడ్


కొడంగల్ ప్రభుత్వాసుపత్రి

కొడంగల్, జనవరి 28 : సొంత నియోజకవర్గ అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఈ ప్రాంత రూపు రేఖలు మార్చేందుకు శ్రీకారం చుట్టారు. కొడంగల్ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా 'కడా' ను ఏర్పాటుచేసి చైర్మన్‌గా జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, ప్రత్యేకాధికారిగా వెంకట్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించడంతో విద్య, వైద్యం, ఉపాధిపై దృష్టి సారించారు. అందులో భాగంగా కోస్గి ప్రభుత్వ పాల్‌టెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలగా, కొడంగల్, కోస్గి ప్రభుత్వాసుపత్రులను 100 పడకలతో అప్‌గ్రేడ్ చేస్తూ విద్యా, వైద్యశాఖ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. 2024-25 విద్యా సంవత్సరం నుంచి ఇంజనీరింగ్ తరగతులను ప్రారంభించేందుకు కసరత్తులు ప్రారంభించింది. మూడు బీటెక్ కోర్సుల్లో 180 సీట్ల భర్తీకి అవకాశం కల్పిస్తూనే పాల్‌టెక్నిక్ తరగతులను యధాతంగా కొనసాగించాలని చెప్పింది. పాల్‌టెక్నిక్ కళాశాలలో అందుబాటులో ఉన్న సదుపాయాలు, బోధన సిబ్బంది, సౌకర్యాలపై అధికారులు దృష్టి సారించారు. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ (ఏఐఅండ్‌యంఎల్), కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ డేటా సైన్స్ కోర్సుల రూపకల్పనతో పాటు తదుపరి అవసరమైన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బుర్ర వెంకటేశం చెప్పారు.

ప్రభుత్వాసుపత్రుల అప్‌గ్రేడ్

కొడంగల్, కోస్గి మునిసిపాలిటిల్లోని ప్రభుత్వాసుపత్రులను 100 పడకల ఆసుపత్రులుగా అప్‌గ్రేడ్ చేస్తూ అధికారులు ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఈ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. గతంలో రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే ఈ కృషి చేసినా ఫలితం లేకపోయింది. ప్రస్తుతం తానే సీఎంగా ఉండటంతో ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. బీజాపూర్-హైదరాబాద్ హైవే రోడ్డు, మహబూబ్‌నగర్-చించోలి ప్రధాన రహదారులు కొడంగల్ మీదుగా వెళ్లడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సకాలంలో వైద్య సేవలు అందక, సౌకర్యాలు లేక పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు.

కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతలపై దృష్టి

అన్ని రంగాల్లో వెనకబాటుకు గురైన కొడంగల్ ప్రాంతాన్ని గత పాలకులు పట్టించుకోకపోగా రవాణా, ఉపాధి, మౌలిక సదుపాయలు కల్పించడంలో విఫలం చెందారు. కానీ ప్రస్తుతం సీఎం ప్రత్యేక చొరవతో కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకంతో పలు నియోజకవర్గాలకు తాగు, సాగునీరందించేందుకు కృషి చేస్తున్నారు. ఈ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నమైన వికారాబాద్-కృష్ణా రైల్వేలైన్ రీ సర్వే కోసం రూ.18 కోట్లు విడుదల చేశారు. ఇప్పటికే నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ, పరిశ్రమల ఏర్పాటుకు స్థలాలను పరిశీలించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించారు. వ్యవసాయ పరిశోధన కేంద్రం, కళాశాల ఏర్పాటుకు 50 ఎకరాల స్థలం ఎంపికలో అధికారులు నిమగ్నమయ్యారు. కొడంగల్, కోస్గి ఆర్టీసీ డిపోల అభివృద్ధిపై దృష్టి సారించారు. గురుకుల పాఠశాలలకు నూతన భవనాల నిర్మాణానికి స్థలాలను పరిశీలిస్తున్నారు. గ్రామాల వారీగా అభివృద్ధి నివేదికలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. గతంతో కన్నా ప్రస్తుతం కొడంగల్ అభివృద్ధి దిశగా ముందుకు వెళ్తున్నదని ప్రజలు చర్చించుకుంటున్నారు.



ఇంజనీరింగ్ కళాశాలగా మారనున్న కోస్గి పాల్‌టెక్నిక్ కళాశాల

సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు



సీఎం ఆదేశాల మేరకు కొడంగల్ సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ప్రధానంగా విద్య, వైద్యం, ఉపాధి లక్ష్యంగా పరిశ్రమల ఏర్పాటు ధ్యేయంగా ముందుకు వెళ్తున్నాం. గ్రామాల వారీగా అన్నీ రంగాల్లో అభివృద్ధి పనులకు నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి అందిస్తాం. ఇంజనీరింగ్ కళాశాల, ప్రభుత్వాసుపత్రుల అప్‌గ్రేడ్ కోసం అధికారులు కసరత్తులు ప్రారంభించారు.

- వెంకట్‌రెడ్డి, కడా ప్రత్యేకాధికారి

ఉపాధ్యాయ బదిలీలు చేపట్టాలి

- టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

చేవెళ్ల, జనవరి 28 : ఉపాధ్యాయుల బదిలీలు నిర్వహించి, పదోన్నతులు కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) రాష్ట్ర కోశాధికారి టి. లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని మారికా పాఠశాల ఆవరణలో ఆ సంఘం జిల్లా కమిటీ విస్తృస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాలుగా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు నిర్వహించలేదని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బదిలీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. గత ప్రభుత్వంలో ప్రజా ప్రతినిధుల సిఫారసులతో జిల్లాకు వచ్చిన ఉపాధ్యాయులను తిరిగి వారి సొంత జిల్లాలకు పంపించాలని జిల్లా అధ్యక్షుడు కె. గోపాల్‌నాయక్ అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాములయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కల్పన, ఆడిట్‌కమిటీ చైర్మన్ రఘుపాల్, జిల్లా కార్యదర్శులు నాగేంద్రం, వెంకటయ్య, కిషన్ చౌహాన్, బీమ్‌రెడ్డి, భగవంత్‌రాజ్, రామకృష్ణ, భువనేశ్వరి, శివారెడిఢ్ద, నర్సింలు, బుగ్గరాములు, గణేశ్‌కుమార్, శ్యామలాదేవి, శంకర్‌నాయక్, మహమ్మద్ ఆక్బర్, రాష్ట్ర కమిటీ సభ్యులు సుగంధం, చేవెళ్ల మండల అధ్యక్ష, కార్యదర్శులు గణేశ్, లాలయ్య, నాయకులు కిరణ్‌మహేందర్ రెడ్డి, వెంకటేశ్, విజయ్‌కుమార్, కృష్ణ, యాదగిరి,అక్షయ్, చంద్రశేఖర్, ప్రభాకర్, రమేశ్ తదితరులు ఉన్నారు.

పరిగి అభివృద్ధిపై నీలినీడలు

- మంజూరైన నిధులు రద్దయ్యే అవకాశం
- కొత్త ప్రభుత్వంపై ప్రజల ఆశలు


పరిగి పట్టణం

పరిగి, జనవరి 28 : గత ప్రభుత్వం పరిగి మునిసిపాలిటీ అభివృద్ధికి మంజూరు చేసిన నిధులపై నీలినీడలు కమ్ముకున్నాయి. మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పరిగి పట్టణ అభివృద్ధి కోసం జూలైలో రూ.25 కోట్ల నిధులను పురపాలక శాఖ నుంచి తీసుకువచ్చిన సంగతి విదితమే. ఈ సందర్భంగా బస్తీబాట పేరిట మహేశ్‌రెడ్డి పర్యటించి చేపట్టబోయే అభివృద్ధి పనులను మునిసిపల్ పరిధిలోని 15 వార్డుల్లోని కాలనీల్లో పనులను గుర్తించారు. ఇంజనీరింగ్ శాఖ అధికారులతో అంచనాలను తయారు చేసి ప్రతిపాదనలు పంపారు. ఈ పనులు టెండర్ దశలో ఉండగానే ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ప్రక్రియ నిలిచిపోయింది. అనంతరం ప్రభుత్వం మారడంతో మంజూరైన నిధుల విడుదలపై ఆయోమయం నెలకొంది. రూ.25 కోట్ల నిధుల విడుదలు విడుదలై పనులు కొనసాగితే పరిగి పట్టణాభివృద్ధి జరిగేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. పూర్తయిన అభివృద్ధి పనుల బిల్లులను ప్రభుత్వం చెల్లించే పరిస్థితి లేదు. ఇప్పటికే పలు పనులను రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం సంకేతాలు ఇచ్చింది. పరిగికి మంజూరైన నిధులు కూడా రద్దయ్యే అవకాశం ఉందని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఎన్నికైన ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి ఈ నిధులను విడుదల చేయించి, పనులు పూర్తి చేయించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


పరిగిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న నాటి ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి(ఫైల్)

టెండర్ దశలో ఉంది



గత ప్రభుత్వం రూ.25 కోట్ల నిధులను మంజూరీ చేసింది. అభివృద్ధి పనులను గుర్తించి పంపించాం. పనులు టెండర్ దశలో ఉండగా ప్రభుత్వం మారింది. ప్రభుత్వం మారినా నిధులు వస్తాయనే నమ్మకం ఉంది. నిధుల విడుదల కోసం అవసరమైతే ప్రభుత్వ పెద్దలను కలిసి విన్నవిస్తాం.

ఎం.అశోక్, మునిసిపల్ చైర్మన్, పరిగి

ఘనంగా మల్లన్న కల్యాణోత్సవం


మలికార్జున స్వామికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్‌రూరల్ ,జనవరి 28 : మండల పరిధిలోని హమీదుల్లా నగర్‌లో మల్లికార్జున స్వామి (మల్లన్న) కల్యాణోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ ఉత్సవాల్లో స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, షైలార్‌దేవుపల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీటీసీ నీరటి తన్వీరాజు, ఎంపీపీ జయమ్మశ్రీనివాస్ పాల్గొని మల్లన్న స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు గ్రామంలోని మహిళలంతా బోనాలను నెత్తి పెట్టుకుని ఊరేగింపుగా వెళ్లిన స్వామివారికి బోనాలను సమర్పించారు. ప్రతి ఏడాది మల్లన్న జాతర ఘనంగా నిర్వహిస్తామని గ్రామస్తులు తెలిపారు. ఆలయ అభివృద్ధి కోసం కృషి చేస్తానాని ఎమ్మెల్యే చెప్పారు. మల్లన్న ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. తనవంతు ఆలయ అభివృద్ధి కోసం కృషి చేస్తానని కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి మల్లన్న చెప్పారు. సర్పంచ్ సతీష్‌యాదవ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గుట్టలు, క్రషర్లపై వడ్డెరలకు పూర్తి హక్కులివ్వాలి


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న విఘ్నేశ్, తదితరులు

కందుకూరు, జనవరి 28 : రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని గుట్టలు, క్రషర్‌లపై పూర్తి హక్కులను వడ్డెర వృత్తిదారులకు ఇవ్వాలని వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లవ విఘ్నేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని మీర్కాన్‌పేటలోని క్రషర్ వద్ద ఆ సంఘం రూపొందించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను మండల శాఖ అధ్యక్షుడు వెంకటయ్య ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పెద్దపెద్ద గుట్టలు పెత్తందారుల చేతుల్లోకి వెళ్లి పూర్తిగా అంతరించి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పూర్వీకులు ఆ గుట్టల్లో గ్రానైట్, కంకరను కొట్టుకుని కుటుంబాలను పోషించుకునేవారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వడ్డెర ఫెడరేషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తమ కుటుంబాలకు ప్రమాద బీమా, రేషన్‌కార్డులు, ఇళ్లు, స్థలాలు, ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆ సంఘం నేతలు విష్ణు, శ్రీనివాస్, లక్ష్మయ్య, దేవయ్య, నర్సింహా, రాజు, రాంచంద్రి, కృష్ణ, బుచ్చయ్య, జంయ్య, విజయేందర్, శ్రీశైలం, అంజయ్య పాల్గొన్నారు.

'ఆ పార్టీ నాయకులను రానివ్వొద్దు'

ధారూరు, జనవరి 28 : తమ నాయకులు, కార్యకర్తలను బెదిరించి కాంగ్రెస్‌ను ఓడించాలని ప్రయత్నించిన ప్రత్యర్థి నాయకులను పార్టీలోకి రానివ్వొద్దని నాయకులు ముక్తకంఠంతో అధిష్ఠానం పెద్దలను కోరుతున్నారు. పదేళ్ల అధికారంలో ఉండి కాంగ్రెస్ పార్టీని, స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను విమర్శించిన నాయకులు తమ పార్టీలో చేరేందుకు ప్రయత్నిస్తున్నారని, వారిని చేర్చుకుంటే ప్రజలలో బదునాం అయ్యే ప్రమాదం ఉందని కాంగ్రెస్ మండల నాయకులు, కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లోకి రాని ఆ నాయకులు ఇప్పుడు వస్తామంటే ఎట్టి పరిస్థితులలో పార్టీలోకి తీసుకోకూడదని పార్టీ శ్రేణులు స్పీకర్ ప్రసాద్‌కుమార్, పార్టీ పెద్దలను కోరుతున్నారు. పదేళ్ల ప్రతిపక్షంలో ఉండి ఎన్నో కష్టనష్టాలకు ఎదురొడ్డి నిలబడి ఎన్నికలలో పార్టీని గెలిపించిన కార్యకర్తలను గుర్తించాలని వారు అభిప్రాయపడుతున్నారు. పదవులు, కాంట్రాక్టు పనులు, పైరవీలు చేసి డబ్బులు సంపాదించుకునేందుకే కాంగ్రెస్‌లోకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్న వారికి చెక్ పెట్టాలని పార్టీ శ్రేణులు కోరుతున్నాయి. స్వప్రయోజనాల కోసం వచ్చే వారిని చేర్చుకుంటే క్యాడర్ నిరుత్సాహనికి గురై పార్టీకి ఇబ్బందులు ఎదురవుతాయని వారు తమ నాయకుల వద్ద వాపోతున్నారు.

తొలిదశ ఉద్యమకారుడు వీరారెడ్డికి ఘన నివాళి


వీరారెడ్డి విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

మూడుచింతలపల్లి, జనవరి 28 : తొలిదశ తెలంగాణ ఉద్యమకారుడు కామిడి వీరారెడ్డి 21 వ వర్ధంతిని మూడుచింతలపల్లి మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ప్రధాన కూడలిలోని వీరారెడ్డి విగ్రహానికి ఆయన కుటుంబసభ్యులు, సర్పంచ్ జాము రవి, ఎంపీపీ హారిక పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జాము రవి మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ తొలిదశ తెలంగాణ ఉద్యమకారుడు వీరారెడ్డి చేసిన సేవలను గుర్తించి ఆయన జ్ఞాపకార్థంగా మూడుచింతలపల్లిని నూతన మండలంగా ప్రకటించారని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వీరారెడ్డి పేరు పెట్టాలని అధికారులను ఆదేశించారని చెప్పారు. మూడుచింతలపల్లికి రాష్ట్ర స్థాయిలో పేరు ప్రఖ్యాతలు తీసుకురావడానికి వీరారెడ్డి కృషి చేశారని, అభివృద్ధి అంతా ఆయన చొరవతోనే జరిగిందని గుర్తుచేశారు. ఉపసర్పంచ్ వెంకటరమణరెడ్డి, వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

అసంపూర్తి భవనాలు.. విద్యార్థుల అగచాట్లు

- అధికారులు, ప్రజాప్రతినిధుల అలసత్వం
- ఒకటి ఉండగా మరో భవన నిర్మాణానికి సిద్ధం
- డీపీఈపీ, ఆర్వీఎం కింద వేర్వేరుగా మంజూరు..
- ఏ ఒక్కటీ పూర్తికాని వైనం.. విద్యార్థుల అవస్థలు
- కొందుర్గు మండలం తంగళ్లపల్లి పాఠశాల దుస్థితి
- ఒక ఉపాధ్యాయుడు.. ఏడుగురు మాత్రమే విద్యార్థులు


శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్లు

కొందుర్గు, జనవరి, 28: ఐదు తరగతులు.. ఏడుగురు విద్యార్థులు.. ఒక డిప్యుటేషన్ ఉపాధ్యాయుడు.. పాఠశాలకు భవనం మంజూరయ్యాక మరో భవనానికి పచ్చజెండా.. తీరా చూస్తే ఆ రెండు భవనాలూ అసంపూర్తి. వెరసి అధికారులు చేసిన పొరపాటు విద్యార్థులకు గ్రహపాటుగా మారింది. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని తంగళ్లపల్లిలోని దళితవాడలో 2001 ఆగస్టులో ఓ ప్రైవేట్ గదిలో 25 మంది విద్యార్థులు, ఒక వాలంటీర్‌తో ప్రాథమిక పాఠశాలను ప్రారంభించారు. సంవత్సరం తరువాత ప్రభుత్వం ఒక ఉపాధ్యాయుడిని నియమించింది. ఈక్రమంలో 2002 మార్చిలో డీపీఈపీ(డిస్ట్రిక్ట్ ప్రైమరీ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం) నుంచి 1.90 లక్షలతో పాఠశాలకు భవనం మంజూరైంది. పునాదులను ఓ కాంట్రాక్టర్, గోడలను మరొకరు, స్లాబ్‌ను ఇంకొకరు నిర్మించారు. నిధులు సరిపోవడం లేదంటూ ముచ్చటగా ముగ్గురు భవన నిర్మాణాన్ని అర్ధంతరంగా వదిలేశారు. భవనానికి ప్లాస్టింగ్, ఫ్లోరింగ్ చేయకుండానే వదిలివేశారు. ఆ భవనంలోనే 5 తరగతులకు కలిపి 7మంది విద్యార్థులకు.. చెక్కలోనిగూడెం పాఠశాల నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన ఉపాధ్యాయుడితో విద్యాబోధన కొనసాగుతోంది. కాగా, ఆ భవనం కాస్త శిథిలావస్థకు చేరుకుంటోంది. అయితే, దళిత వాడ పాఠశాల అసంపూర్తి భవనంలోనే కొనసాగుతుండగా.. ప్రభుత్వం 2012లో ఆర్వీఎం(రాజీవ్ విద్యా మిషన్) నుంచి రూ.5లక్షలు వెచ్చించి మరో భవనాన్ని మంజూరు చేశారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ పిల్లర్స్, స్లాబ్ వేసి, భవన నిర్మాణాన్ని అర్థాంతరంగా వదిలేశారు. దాంతో ఆ భవనం కూడా అసంపూర్తిగా మిగిలిపోయింది. అదేవిధంగా రెండోసారి కడుతున్న పాఠశాల భవనానికి పక్కనే విద్యార్థుల కోసం మరుగుదొడ్లను సైతం నిర్మించారు. ప్రస్తుతం అవి కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి. కాగా, భవన నిర్మాణం చేపట్టి సరిపడా టీచర్లను నియమిస్తే విద్యార్థులు సంఖ్య ఎక్కువగా ఉండేదని గ్రామస్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.


అసంపూర్తి భవనంలో కొనసాగుతున్న విద్యా బోధన

అధికారులు, ప్రజాప్రతినిధుల అలసత్వం

పాఠశాల భవనం నిర్మాణంలో అధికారులు, ప్రజాప్రతినిధులు చేసిన పొరపాటు విద్యార్థులకు గ్రహపాటుగా మారింది. మొదటి భవనం నిర్మాణ దశలో ఆగిపోయింది. దానిని పూర్తి చేయకుండా, అదే పాఠశాలకు మరో భవనాన్ని మంజూరుచేయడం అధికారుల అనాలోచిన నిర్ణయానికి నిదర్శనం. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో విద్యార్థులు ఇబ్బందుల పాలవుతున్నారు. రెండు భవనాల్లో ఏ ఒక్కటీ పూర్తికాలేదు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డీపీఈపీ, ఆర్వీఎం అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో రెండు భవనాలు అసంపూర్తిగా మిగిలాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అసంపూర్తి భవనాల నిర్మాణ పనులను పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని దళితవాడ వాసులు కోరుతున్నారు.


డీపీఈపీ నిధులతో చేపట్టిన భవనం, శిథిలావస్థకు చేరిన దృశ్యం

ఎమ్మెల్యే సారూ... భవనాలను పూర్తి చేయించండి

కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో స్థానిక ఎమ్మెల్యే భవన నిర్మాణాలపై దృష్టిసారించాలని గ్రామస్తులు కోరుతున్నారు. 22 ఏళ్లుగా పాఠశాలకు సరైన భవనం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు భవనాలు మంజూరైనా.. ఏ ఒక్కటీ పూర్తికాలేదని, కొత్త ఎమ్మెల్యే భవనాల నిర్మాణ పనులు పూర్తి చేయించాలని దళితవాడ ప్రజలు కోరుతున్నారు.


ఆర్వీఎం నిధులతో చేపట్టిన పాఠశాల భవనం

నిధులు మంజూరైతేనే నిర్మాణం..



మొదటి భవనానికి బిల్లులు సరిగ్గా అందలేదని తెలిసింది. రెండో భవనాన్ని కాంట్రాక్టర్ సకాలంలో పూర్తి చేయకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లాయి. మళ్లీ నిధులు మంజూరైతే ఆ రెండు భవనాలనూ పూర్తి చేయవచ్చు. అయితే, కనీసం ఒక భవనమైనా వినియోగంలోకి తెచ్చేందుకు తగిన చర్యలు తీసుకుంటాం.

- కిష్టారెడ్డి, ఎంఈవో, కొందురు

పిల్లలను ఎవరూ బడికి పంపడం లేదు



మా గ్రామంలో ఉన్న రెండు పాఠశాల భవనాల్లో ఏదో ఒక భవనాన్ని వెంటనే పూర్తి చేయాలి. గ్రామంలో మరో 10 మంది బడీడు పిల్లలున్నారు. పాఠశాలకు సరైన భవనం లేక విద్యార్థులను బడికి పంపడం లేదు. అధికారులు చొరవ తీసుకోవాలి.

- ఎ.అంతమ్మ, తంగెళ్లపల్లి, దళితవాడ, మధ్యాహ్న భోజన కార్మికురాలు

శిథిలావస్థలో మొదటి భవనం



పాఠశాలకు సరైన భవనం లేక ఇబ్బంది మారింది. రెండు భవనాల నిర్మాణాన్ని పూర్తి చేయాలి. మొదటి భవనం ఇప్పటికే శిథిలావస్థకు చేరుకుంది. రెండో భవనం అసంపూర్తిగా ఉంది. ఏదో ఒక భవనమైనా, పూర్తిస్థాయిలో నిర్మాణం చేయాలి. బడికి విద్యార్థులను పంపాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారు.

- రాజ్యవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయుడు

గతంలో అధికారులు, ఎమ్మెల్యేకు విన్నవించాం



22 ఏళ్ల క్రితం భవనం మంజూరైంది. ముగ్గురు కాంట్రాక్టర్లు పనులు చేశారు. కానీ, భవనం పూర్తి కాకుండా అసంపూర్తిగా మిగిలింది. 2012లో మరోసారి రెండో భవనం మంజూరైంది. అదికూడా పూర్తికాలేదు. ఈ విషయమై ప్రతీసారి మండల సర్వసభ్య సమావేశంలో అధికారులు, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ దృష్టికి తీసుకెళ్లాం. కానీ, నిధులు మంజూరు కాలేదు. ప్రస్తుత ఎమ్మెల్యే నిధులు మంజూరు చేస్తారని ఆశిస్తున్నాం.

- కె.బాల్‌రాజ్, సర్పంచ్, తంగళ్లపల్లి

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


బస్సు ఢీకొనడంతో చెల్లాచెదురుగా పడిన వ్యక్తులు, బస్సు కింద బైక్

కొత్తూర్, జనవరి 28: మండల కేంద్రానికి సమీపంలో గల వైజంక్షన్ వద్ద ఆదివారం సాయంత్రం బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు గాయపడినట్లు ఎస్సై జి.శ్రీనివాస్ తెలిపారు. మహేశ్వరం మండలం మాణిక్యమ్మగూడ గ్రామానికి చెందిన శంకరయ్య, బాలయ్యలు బైక్‌పై వెళ్తుండగా, ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఇద్దరు గాయపడినట్లు తెలిపారు. ఈమేరకు క్షతగాత్రులను శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ అసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

కారు బోల్తా.. నలుగురికి స్వల్పగాయాలు

మొయినాబాద్ రూరల్, జనవరి 28 : అతివేగం కారణంగా అదుపు తప్పి ఓ కారు బోల్తాపడిన ఘటనలో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఆదివారం ఉదయం సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామం నుంచి ఓ కారు అతివేగంగా జేబీఐఈటీ కూడలి సమీపంలోకి చేరుకుంది. ఈక్రమంలో రోడ్డుపక్కన ఉన్న బండరాళ్లల్లోకి చొచ్చుకెళ్లి బోల్తాపడింది. ఈ ఘటనలో ఎవరికి పెద్ద గాయాలేమీ కాలేదు. వారంతా ఓ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వెళ్లినట్లు తెలిసింది. కారులో యువతీయువకులతో పాటు మద్యం సీసాలున్నట్లు తెలిసింది. కేసు నమోదు చేసి కారును స్టేషన్‌కు తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

షాద్‌నగర్ రూరల్, జనవరి 28: షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లింగారెడ్డిగూడ శివారులో ఉన్న నీటిగుంటలో పడి వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఎస్సై దేవకి కథనం ప్రకారం.. షాద్‌నగర్ పటేల్ రోడ్డుకు చెందిన రాసాల శివకుమార్(31) పెయింటర్‌గా పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. అతడికి ఒక కూతురు ఉంది. ఏడేళ్ల క్రితం భార్య విడిచిపెట్టి వెళ్లిపోగా తల్లితో కలిసి ఉంటున్నాడు. శనివారం రాత్రి లింగారెడ్డి గూడ శివారులో నీటిగుంటలో పడి మృతిచెంది కనిపించాడు. గ్రామస్తుల సమాచారంతో తల్లి అక్కడికి చేరుకుని బోరున విలపించింది. మృతదేహన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి అన్న ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అన్ని ప్రాంతాలకూ సమ ప్రాధాన్యం

- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి


జూపల్లిలో పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు, జనవరి 28: కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను సమగ్రంగా అభివృద్ధి పరిచి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వివక్షకు తావులేకుండా అన్ని ప్రాంతాలకు సమ ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని మండలాల్లో ఆదివారం ఎమ్మెల్యే పర్యటించారు. జూపల్లి, గోకారం, చంద్రాయన్‌పల్లి, శేరిఅప్పారెడ్డి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను జడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీ సింగ్‌తో కలిసి ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో స్థానికులతో కలిసి పర్యటించి ప్రజల సమస్యలడిగి తెలుసుకొని.. పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. గ్రామాలు, తండాలలో ప్రజల అవసరాల కనుగుణంగా మౌళిక వసతులు కల్పించి, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూస్తామన్నారు. అభివృద్ధి విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. భవనాలు లేని అన్ని గ్రామ పంచాయతీలకు త్వరలో భవనాల నిర్మాణానికి కృషి చేస్తానని చెప్పారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను ఖచ్చితంగా అమలు చేస్తుందని చెప్పారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరగా సానుకూలంగా స్పందించినట్లు కసిరెడ్డి తెలిపారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్లక్ష్యం చేసిందని, చేపట్టిన అభివృద్ధి పనులకు నిధులు చెల్లించక సర్పంచ్‌లను ఇబ్బందులను గురి చేసిందని ఆరోపించారు. వచ్చే రెండేళ్లలో కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు సాగునీరందిస్తామని చెప్పారు. ఎంపీపీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు సమాయత్తం కావాలి


చల్లాకు పుష్పగుచ్ఛం ఇస్తున్న జవహర్‌లాల్ నాయక్

కడ్తాల్, జనవరి 28: వచ్చే పార్లమెంట్ ఎన్నికలకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమాయత్తం కావాలని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, రాహుల్ ప్రధాని కావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఆమనగల్లు, కడ్తాల మండలాలకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఆదివారం నర్సింహారెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జవహర్‌లాల్‌నాయక్ ఆధ్వర్యంలో కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో అధికారమే లక్ష్యంగా పార్టీ శ్రేణులంతా కార్యోన్ముఖులు కావాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల తరహాలో ఉత్సాహంగా ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రజాభిమానం కోల్పోయిందని, బీజేపీని ప్రజలు విశ్వసించడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను ఖచ్చింతంగా అమలు చేస్తుందని నర్సింహారెడ్డి తెలిపారు. అదేవిధంగా రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకుపోవాలని సూచించారు. నర్సింహారెడ్డిని కలిసిన వారిలో టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, పీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

నేడు చేవెళ్లకు కేటీఆర్ రాక

- బీఆర్‌ఎస్ పార్టీ విస్తృస్థాయి సమావేశానికి రామారావు

చేవెళ్ల, జనవరి 28 : బీఆర్‌ఎస్ చేవెళ్ల నియోజకవర్గ స్థాయి కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నేడు(సోమవారం) మండల కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు ప్రభాకర్ తెలిపారు. చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అధ్యక్షతన సమావేశం జరుగుతుందని, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి తదితరులు హాజరుకానున్నారని చెప్పారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

గ్రామాల్లో సీపీఐని బలోపేతం చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు


చేవెళ్ల, జనవరి 28 : గ్రామాల్లో సీపీఐని బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గసభ్యులు రామస్వామి, ప్రభులింగం తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మండల సీపీఐ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో సీపీఐని బలోపేతం చేసేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. గ్రామాల్లో పార్టీ సభ్యత్వం గత సంవత్సరం కంటే ఎక్కువ సంఖ్యలో చేయాలని సూచించారు. ప్రజా సంఘాలను బలోపేతం చేయాలని కోరారు. ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో హైదరాబాద్‌లోని మగ్దూం భవన్‌లో సీపీఐ జాతీయ కౌన్సిల్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఎం.సత్తిరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణచారి, మండల సహాయ కార్యదర్శి ఎండీ మక్బూల్, మహిళా అధ్యక్షురాలు వడ్ల మంజుల, నాయకులు విజయమ్మ, లలిత, సత్యనారాయణ, కృష్ణ, సాయిలు, శ్రీశైలం, యాదగిరి, పోచయ్య, ఆనందం, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరం విజయవంతం

యాచారం, జనవరి 28 : మండలంలోని చౌదర్‌పల్లిలో ఆదివారం యశోద అసుపత్రి వైద్యులు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక పాఠశాల ఆవరణలో నిర్వహించిన శిబిరంలో శుక్లలోపంతో బాధపడుతున్న వారిని గుర్తించి ఆపరేషన్ కొరకు రెఫర్ చేశారు. ఈ సందర్భంగా 200 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ కమల్, డాక్టర్ సంతోష, డాక్టర్ మానస, తదితరులున్నారు.


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

పక్కాగా ఆరు గ్యారంటీల అమలు : మల్‌రెడ్డి


గడ్డమల్లాయగూడలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం, జనవరి 28 : ఎన్నికల ముందు తాము ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలను ఖచ్చితంగా ఆమలు చేసి పేదలకు అండగా ఉంటామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ ప్రతీ వ్యక్తిపై రూ.ఏడు లక్షల అప్పులకుప్ప పెట్టి గద్దె దిగిందని ఇబ్రహీంపట్నం ఆరోపించారు. ఆదివారం మండలంలోని గడ్డమల్లాయగూడ, మల్కీజ్‌గూడ, తమ్మలోనిగూడ, మాల్ గ్రామాల్లో రూ.169.10 కోట్ల నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, కమ్యూనిటీ భవనాలు, భూగర్భడ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో రంగారెడ్డి మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన నెల వ్యవధిలో రెండు గ్యారంటీలను అమలు చేశామన్నారు. పార్లమెంట్ ఎన్నికల తరువాత తాను ప్రతీ గ్రామంలో పర్యటించి సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. పదేళ్లక్రితం కాంగ్రెస్ ప్రభుత్వం మిగులు బడ్జెట్‌తో బీఆర్‌ఎస్‌కు అధికారం అప్పగించిందని అన్నారు. నేడు ఖజానా ఖాళీ చేసి ఏం అభివృద్ధి చేశారని, రైతు బంధు పథకం కింద సాయం అందివ్వడం లేదని బీఆర్‌ఎస్ నాయకులు అవాక్కులు చెవాక్కులు పేలడం సిగ్గుచేటన్నారు. గత పాలకులు రేషన్‌కార్డు ఇవ్వలేకపోయిందని.. దాంతో నిరుపేదలు సంక్షేమ పథకాలకు నోచుకోలేకపోయారన్నారు. చాలాచోట్ల తాగునీరు సక్రమంగా రావడం లేదని.. మహిళల ఆవేదన తన దృష్టికి రాకూడదని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. వచ్చే ఎండాకాలంలో ప్రతి గ్రామానికి అదనంగా నీటిని సరఫరా చేసేలా తాను ఉన్నతాధికారులతో మాట్లాడి ఆదుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా తమ్మలోనిగూడ నుంచి ఇబ్రహీంపట్నం వరకు నూతన ఆర్టీసీ బస్సును ఎమ్మెల్యే ప్రారంభించారు. మహిళలకు ఉచిత బస్సు రవాణా వరంలాంటిదన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ కొప్పు సుకన్య బాషా, వైస్ ఎంపీపీ కె.శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ చిన్నోళ్ల జంగమ్మ, సర్పంచులు అచ్చన జంగయ్య, చీర యాదమ్మ, కాల్లె సంతోష, పడకంటి కవిత, నల్లవెల్లి ఎంపీటీసీ లక్ష్మీపతిగౌడ్, కాంగ్రెస్ నాయకులు గుండ్లపల్లి సురేందర్‌రెడ్డి, కె.నారాయణరెడ్డి,ఎన్.సుదర్శన్‌రెడ్డి, తహసీల్దారు శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీవో విజయలక్ష్మి, వ్యవసాయాధికారి సందీప్‌కుమార్, ఆర్ డబ్ల్యూఎస్ డీఈ రాజు. ఏఈ రజిత, మిషన్ భగీరథ ఏఈ అనిరుధ్, ఏపీవో లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు సహకారం


బహుమతులు ప్రదానం చేస్తున్న సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, తదితరులు

మంచాల, జనవరి 28 : గ్రామీణ క్రీడాకారుల అభ్యున్నతికి సహకారం అందిస్తామని ఆరుట్ల సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఆరుట్ల అనుబంధ గ్రామం బుగ్గతండాలో నిర్వహించిన క్రికెట్ క్రీడాపోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ మానసిక ఉల్లాసానికి క్రీడాపోటీలు దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కావలి శ్రీనివాస్, పున్నంరాము, జానీపాష, గుడ్డిమల్ల చంద్రయ్య, మార సురేష్, చిందం ఐలయ్య, టోర్నమెంటు నిర్వాహకులు వెంకటేష్, వినోద్, ప్రవీణ్, మోహన్, శ్రీకాంత్, గణేష్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల సంక్షేమమే ధ్యేయం


కొందుర్గు : ఎమ్మెల్యే వీర్లపల్లిని సన్మానిస్తున్న సర్పంచ్ సరస్వతి

కొందుర్గు, జనవరి 28 : పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పర్వతాపూర్ గ్రామస్థులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కనీసం ఒక్క రేషన్ కార్డుకూడా ఇవ్వలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పేరుతో మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం ఉచితం చేశామని, ప్రజలందరి నుంచి సంక్షేమ పథకాలకోసం దరఖాస్తులను తీసుకోవడం జరిగిందని, అర్హతను బట్టి పథకాలు అందుతాయన్నారు. ఫరూఖ్‌నగర్ జడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, సర్పంచ్ సరస్వతి, ఎంపీటీసీ మంజులా మల్లేష్‌గౌడ్, నాయకులు కృష్ణారెడ్డి, కావలి యాదయ్య, దామోదర్‌రెడ్డి, కె.రాములు గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రాజు, అశోక్‌గౌడ్, ఆంజనేయులు, రాములు, అమర్‌నాథ్‌రెడ్డి, నర్సింలు, మల్లయ్య, శ్యాంసుందర్, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అశాస్త్రీయంగా గ్రామ పంచాయతీల ఏర్పాటు

షాద్‌నగర్ రూరల్ : గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీల ఏర్పాటు అశాస్త్రీయంగా ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆక్షేపించారు. ఫరూఖ్‌నగర్ మండలం మొండోనిరాయి తండాలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఆదివారం ప్రారంభించారు. జడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, సర్పంచ్ సుగుణరవి నాయక్, నాయకులు ఎంపీటీసీ దేవినాయక్, బుజ్జీబాబునాయక్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులున్నారు.

తోపుడు బండి వద్ద ఎమ్మెల్యే బ్రేక్‌ఫాస్ట్

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తాను ఎమ్మెల్యే అనే స్థాయిని మరిచి అందరిలో ఒకరిగా మారాడు. చిన్నపాటి పదవి వస్తేనే డాబు చూపించే ఈ రోజుల్లో ఎమ్మెల్యేగా రోడ్డు పక్కన తోపుడు బండి వద్ద బ్రేక్‌ఫాస్ట్ చేశారు. అందుకు ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట చౌరస్తా వేదికైంది. చౌదరిగూడ మండలంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలో ప్రారంభోత్సవాలకు ఆదివారం వెళ్తున్న ఆయన.. ఎలికట్ట చౌరస్తాలో వాహనాలను నిలిపి తోపుడు బండి వద్ద టిఫిన్ చేశారు. ఆయనతో పాటు వచ్చిన కార్యకర్తలు అక్కడే టిఫిన్ చేశారు. అనంతరం బిల్లు చెల్లించి, చాలా బాగుందని కితాబిచ్చి వెళ్లిపోయారు. దాంతో తోపుడు బండి నిర్వాహకుడు సంతోషం వ్యక్తం చేశాడు.


ఎలికట్ట చౌరస్తాలో బ్రేక్‌ఫాస్ట్ చేస్తున్న ఎమ్మెల్యే

ఘనంగా పోచమ్మ బోనాలు


ఎన్కేపల్లిలో బోనాలతో ఊరేగుతున్న మహిళలు

మొయినాబాద్ రూరల్, జనవరి 28 : రెండేళ్లకోసారి నిర్వహించే బోనాల వేడుకలు మండల పరిధిలోని ఎన్కేపల్లి గ్రామంలో ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు గ్రామంలోని పోచమ్మ అమ్మవారికి మహిళలు బోనమెత్తారు. ఈ సందర్భంగా ఊరేగింపుగా తరలివెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాల మధ్య యువకుల తొట్టెల ఊరేగింపు కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. అలాగే మండల పరిధిలోని బాకారంజాగీర్ గ్రామంలో బోనాల ఉత్సవాలు నిర్వహించారు.

మల్లు రవిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



ఆమనగల్లు, జనవరి 28: ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక అధికార ప్రతినిధిగా నియమితులైన టీపీసీసీ ఉపాధ్యక్షులు డాక్టర్ మల్లు రవిని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు రవీందర్ నాయక్, గుర్రం కేశవులు, వస్పుల జంగయ్యలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివారం ఢిల్లీలో నిర్వహించిన మల్లు రవి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు. మల్లును పూల మాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు రాబట్టాలని ఈ సందర్భంగా కోరినట్లు తెలిపారు. మల్లును కలిసినవారిలో ఆమనగల్లు మండల స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు కాసోజు రాము తదితరులున్నారు.

నేడు బీఆర్‌ఎస్ నియోజకవర్గ స్థాయి కృతజ్ఞత సభ

కందుకూరు, జనవరి 28: మీర్‌పేటలోని సామ యాదవరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నేడు(సోమవారం) నిర్వహించనున్న బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ స్థాయి కృతజ్ఞతా సభకు మండలం నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి పార్టీ మండలాధ్యక్షుడు మన్నె జయేందర్ ముదిరాజ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ సోమవారం ఉదయం 10గంటలకు నిర్వహించనున్న కృతజ్ఞతా సభకు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని పార్టీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మార్కెట్ కమిటీ, సహకార సంఘాలు, రైతు బంధు సమితి, చైర్మన్లు, వైస్ చైర్మన్లు, మాజీ ప్రజాప్రతినిధులు, మండల గ్రామస్థాయి పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు, అనుబంధ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు సకాలంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల వేతనాలు పెంచాలి

యాచారం, జనవరి 28 : మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పి.బ్రహ్మయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండలంలోని గున్‌గల్ రిజర్వాయర్ ఎదుట మిషన్ భగీరథ కాంట్రాక్ట్ ఉద్యోగులు ధర్నా చేశారు. ఆయన పాల్గొని మాట్లాడుతూ ఉద్యోగభద్రత కల్పించాలన్నారు. గుర్తింపు కార్డులు అందించాలని, పీఎఫ్, ఈఎస్ఐ వర్తింపచేసి ఆదుకోవాలన్నారు. భిక్షపతి, నాగరాజు, నవీన్, బాల్‌రాజ్, తదితరులున్నారు.

శివదీక్ష ధారణ ప్రారంభం

చౌదరిగూడ, జనవరి 28: శివదీక్ష ధారణ కార్యక్రమాన్ని గురుస్వామి కమ్మరి భూపాలచారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం మండల పరిధిలోని పెద్ద ఎల్కిచర్ల గ్రామంలోని శివాలయంలో కొందుర్గు మండలంతో పాటు జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని పద్మారం, చౌదరిగూడ, ఎల్కాగూడ, లక్ష్మీదేవిపల్లి తదితర గ్రామాలకు చెందిన భక్తులకు గురుస్వామి భూపాలచారి శివమాల ధారణ చేశారు. ఈ సందర్భంగా గురుస్వామి మాట్లాడుతూ శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శివ దీక్ష ధారణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు స్వాములు నర్సింలు, రామకృష్ణ, సత్యనారాయణ, అంజయ్య, హరీష్, లింగం, రఘు తదితరులు పాల్గొన్నారు.


శివ మాలధారణ చేస్తున్న గురుస్వామి భూపాలచారి